క్లుప్తంగా

మొక్కలు నాటుదాం..



మొక్క నాటుతున్న రజిత

హుస్నాబాద్: చెట్ల పెంపకంతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. వన మహోత్సవం సందర్భంగా 12వ వార్డులో గురువారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల కాలుష్యం తగ్గుతుందని, ఆక్సిజన్ శాతం పెరుగుతుందన్నారు. మొక్కలను కాపాడి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వన మహోత్సవ సూపర్‌వైజర్ శంకర్, పర్యావరణ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న మంజునాథ్

చిన్నకోడూరు(సిద్దిపేట): భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చిన్నకోడూరు రైతు వేదికలో భూసార పరీక్ష కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డా.మంజునాథ్ మట్టిని పరీక్షించే విధానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ రైతులు భూమిలో పోషకలోపాలు సరిచేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నేలను సారవంతం చేయడానికి పశువుల ఎరువు, పచ్చిరొట్టను భూమిలో కలియదున్నాలని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నిహారిక, రమేశ్, రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.

భద్రాచల రాముని తలంబ్రాలు పంపిణీ



తలంబ్రాలను పంపిణీ చేస్తున్న రామరాజు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త గ్రామస్తులకు గురువారం గజ్వేల్ శ్రీరామ కోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు భద్రాచల రాముని ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు. గ్రామ హనుమాన్ మందిరం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం దేవస్థానం అందించిన 100కిలోల ముత్యాల తలంబ్రాలను గోటి తలంబ్రాల దీక్షలో భాగస్వాములైన రాష్ట్రంలోని లక్షమంది భక్తులకు అందజేయాలన్నదే సంకల్పమని పేర్కొన్నారు. చాంద్‌ఖాన్‌మక్త గ్రామస్తులు గోటి తలంబ్రాల దీక్ష ద్వారా భద్రాచల రాముని కల్యాణ క్రతువులో భాగమయ్యారని, కల్యాణ తలంబ్రాలు అందుకున్నారని చెప్పారు.

ఓటరు జాబితా కోసం కసరత్తు

కొండపాక(గజ్వేల్): త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఓటరు జాబితా తయారీపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. వచ్చే నెల 6న ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేయనున్న నేపథ్యంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు జాబితాను తయారు చేయించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 21న జాబితాను ఆయా గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డుల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

గజ్వేల్‌రూరల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాయపోల్ మండలం ముంగీస్‌పల్లికి చెందిన షమీమ్‌బేగం(38) విద్యానగర్‌లో తమ కుటుంబ సభ్యులతో ఉంటూ గజ్వేల్‌లో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తుంది. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. దానికి తోడు కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై బుధవారం సాయంత్రం కూరగాయలు తీసుకువస్తానని బయటకు వెళ్లి ఇంటి సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అది గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కబ్జా కోరల్లో కుంటలు

కోట్ల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు రెవెన్యూ అధికారులు. ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా పలు గ్రామాలలో విలువైన చెరువులు, కుంటలు అక్రమార్కులకు ఫలహారంగా మారాయి. వాటిని కొన్నేళ్లుగా యథేచ్ఛగా దున్నుకుంటున్నారు. కబ్జా భూములను దర్జాగా పట్టాభూమిగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

– మర్కూక్(గజ్వేల్)



కబ్జాకు గురైన బాలసాగర్ కుంట

- బాలసాగర్, ఎర్రకుంటలు కనుమరుగు
- అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు
- నామ్‌కేవాస్తేగా సర్వేలు, హద్దులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బాలసాగర్ కుంట(దయ్యాల కుంట) 539సర్వే నంబర్‌లో 12ఎకరాల 29గుంటల భూమి ఉంది. అందులో సుమారు ఏడెకరాల భూమి కబ్జాకు గురైంది. అలాగే ఎర్రకుంట 578సర్వే నంబర్‌లో 6:31ఎకరాలలో మూడెకరాల భూమి కబ్జాకు గురైందని గ్రామస్తులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడం వల్లే ప్రభుత్వ భూములు కబ్జాదారులచేతుల్లోకి వెళ్తున్నాయని, వాటిని రక్షించాలని వారు కోరుతున్నారు.

సర్వే నిర్వహించలేదు

నాలుగు సంవత్సరాల క్రితం మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి కొండపోచమ్మ సాగర్ కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో గంగాపూర్ గ్రామస్తులు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఏయే ప్రాంతాల్లో భూములు కబ్జాకు గురయ్యాయో పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించారు. కాని ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు గంగాపూర్ ప్రభుత్వ భూముల్లో సర్వే నిర్వహించలేదని గ్రామస్తులు చెబుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి



బాలసాగర్, ఎర్రకుంటలు చాలా యేళ్లుగా కబ్జాకు గురయ్యాయి. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. నాలుగు సంవత్సరాల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేస్తే వాళ్లువచ్చి తూతూ మంత్రంగా సర్వేచేసి వెళ్లిపోయారు. కనీసం హద్దులు కూడా ఏర్పాటు చేయలేదు. కబ్జాదారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములను దర్జాగా దున్నుకుంటున్నారు. రోజురోజుకు ప్రభుత్వ భూమి కనిపించకుండా పోతోంది. వెంటనే అధికారులు స్పందించి సర్వే చేపట్టి కంచెవేయాలి.

– నాచోనియా రాంసింగ్, గంగాపూర్ గ్రామస్థుడు

కబ్జా భూముల్లో సర్వే నిర్వహిస్తాం



ఎచ్ఎండీఏ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేయిస్తున్నాం. ఆయా ప్రాంతాలకు వెంటనే రెవెన్యూ అధికారులను పంపించి కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల్లో సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయిస్తాం. ఈ విషయం ఇంతకు ముందే నా దృష్టికి వచ్చింది. బాలసాగర్ కుంట, ఎర్రకుంట భూములను ఎవరు ఆక్రమించినా, ఎంతటి వారైనా తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఆయా భూములను గుర్తించి అక్కడే హద్దులు ఏర్పాటు చేయిస్తాం.

– ఆరిఫా, తహసీల్దార్

ఘనంగా మాతృభాషా దినోత్సవం



చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట)/దుబ్బాకటౌన్: అమ్మ నేర్పిన తియ్యని భాష తెలుగును మర్చి పోవద్దని, ఎన్ని భాషలు నేర్చినప్పటికీ తెలుగుభాష గొప్పదని చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు పరశురాములు విద్యార్థులకు చేతిరాత, పద్య పఠనం, గేయాలాపన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలాగే రాయపోల్ మండలం వడ్డేపల్లి ఉన్నత పాఠశాలలో గిడుగు రామూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చంద్రయ్య మాట్లాడుతూ.. రామ్మూర్తి వ్యవహారిక భాషా ఉద్యమానికి మూలపురుషుడని, బహుభాషావేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, రజని, ఇంద్రసేనా రెడ్డి, వరప్రసాద్, కర్ణాకర్ తదితరులుపాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నామని టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన రాజేందర్ ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని నర్సాపూర్ చౌరస్తా వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి గురువారం పట్టుకున్నారన్నారు. అక్రమంగా ఇసుక, రేషన్ బియ్యం రవాణా చేసేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

'రుణమాఫీకి కొర్రీలు'

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సవాలక్ష కొర్రీలు పెట్టి మాఫీ కాకుండా చేస్తోందని మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు మండిపడ్డారు. మండల పరిధిలోని అల్వాలలో గురువారం ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. అధికారులు సెల్ఫీలు దిగితేనే రుణమాఫీ వస్తుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, బతుకు దెరువు కోసం వలస వెళ్లిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ కో–ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, మాజీ ఉప సర్పంచ్ దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

మద్దూరు(హుస్నాబాద్)/గజ్వేల్‌రూరల్/బెజ్జంకి(సిద్దిపేట): రేషన్ కార్డు ఉండి రూ.2లక్షలు పైన రుణ మాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని ఏవో అఫ్రోజ్ అన్నారు. గురువారం ఆయన దూల్మిట్ట వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఏ సమాచారం రాలేదని వచ్చిన వెంటనే రైతులకు తెలియజేస్తామన్నారు. అదేవిధంగా గజ్వేల్ మండల పరిధిలోని బెజుగామ గ్రామంలో ఏఈవోలు మాధవి, జ్యోతి రుణమాఫీపై సర్వే చేపట్టారు. రుణమాఫీ వర్తించని రైతుల జాబితాను సేకరించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని చిలాపూర్‌లో ఏఓ సంతోష్ రైతుల వివరాలు నమోదు చేశారు. ఆయన వెంట ఏఈఓ శ్వేత, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించండి

- ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్/కొండపాక/దుబ్బాక: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సిద్ది పేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. రెండు రోజుల క్రితం రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వాహనదారులకు పీఎస్‌లో గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ ఉమేశ్, సదాశివరావు, హెడ్‌కానిస్టేబుల్ సత్యం పాల్గొన్నారు. అదేవిధంగా కొండపాకలోని విశ్వనాథపల్లిలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీఐ లతీఫ్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ శ్రీనివాస్, లింగారావు, పీఏసీఎస్ డైరెక్టరు సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. దుబ్బాక నుంచి దుంపలపల్లి వెళ్లే దారిలో మూలమలపుల వద్ద ఎస్ఐ గంగ రాజు సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అతివేగంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటయ్య

ములుగు(గజ్వేల్): విద్యార్థులు బాగా చదువుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. ములుగులోని గురుకుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలను పరిశీలించి విద్యార్థులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి అన్నిరంగాల్లో రాణించి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సొంత ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో అదనంగా రెండు బోర్లు వేయాలని, ఇతర మరమ్మతులను పూర్తిచేయించాలని ప్రిన్సిపాల్ పుష్పలతతో పాటు ఆయనకు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, కమిషన్ సభ్యులు కె.లక్ష్మీనారాయణ, శంకర్, రాంపాల్‌నాయక్, ఏగొండస్వామి, వేణు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంఈవో రమ్య ఆధ్వర్యంలో అధికారులు పాఠశాలను సందర్శించారు. వంటగది, ఆవరణాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరామ్, తహసీల్దార్ అనంతరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం బెజ్జంకి, గన్నేరువరం ఉమ్మడి మండలాల నూతన చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు డైరెక్టర్‌లతో మార్కెట్ కార్యదర్శి వెంకటయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం విక్రయాలకు నూతన పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతిరైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ జరుగుతుందని, అధికారులు లబ్ధిదారుల నుంచి సమాచారం సేకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ, మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, దామోదర్, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్షణ కరవు

- విద్యార్థి సంఘాల నాయకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న నాయకుడు

సిద్దిపేటఅర్బన్: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని, కుక్కలు దాడిచేసినా పట్టించుకునే వారే కరువయ్యారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. మండలంలోని ఎన్సాన్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతికి చెందిన ముగ్గురు బాలికలపై శనివారం రాత్రి కుక్కలు దాడి చేసి గాయపర్చిన విషయం తెలిసి గురువారం ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలను సందర్శించారు. గాయపడిన విద్యార్థులను పరామర్శించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అభిషేక్, రవి మాట్లాడుతూ గురుకుల పాఠశాలకు సొంతభవనం లేకపోవడం ప్రస్తుతం కొనసాగుతున్న భవనానికి కాంపౌండ్ వాల్ లేకపోవడంతో కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయన్నారు. వినయ్, నవదీప్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ సేవలు చరిత్రాత్మకం

ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతీ విద్యార్థి ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



దుబ్బాక: క్రీడా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



దుబ్బాకటౌన్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విమల



వర్గల్(గజ్వేల్): క్రీడాంశాలపై విద్యార్థుల ప్రదర్శన



సిద్దిపేటజోన్: క్రీడాకారులతో జయదేవ్ ఆర్య

క్రీడల్లో సత్తా చాటాలి

– ఎమ్మెల్సీ యాదవరెడ్డి

మర్కూక్(గజ్వేల్): గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారిణులు తమ ప్రతిభను కనబరచాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ క్రీడా దినోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఆటలపోటీల కార్యక్రమానికి ఆయన హాజరై విజేతలైన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ లక్ష్యాలను చేరుకోవాలంటే కష్టాలను ఇష్టాలుగా భావించి ముందుకు వెళ్లాలన్నారు. ప్రతిభగలవారిని ఆదరించడంలో తమ వంతు కృషి ఎప్పటికీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, మాజీ సర్పంచ్ భాస్కర్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి



ములుగు(గజ్వేల్): బీజేపీ సభ్యత్వ నమోదుకు రెట్టింపు ఉత్సాహంతో కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, పార్టీ ములుగు మండల ఇన్‌చార్జి వెంకటరమణ పిలుపునిచ్చారు. వంటిమామిడిలో మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాములు, భాగలక్ష్మి, అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ దూడల ఉత్పత్తిపై అవగాహన

గజ్వేల్‌రూరల్: దూడల ఉత్పత్తిపై గోపాలమిత్రలకు అవగాహన కల్పించామని పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాంజీ తెలిపారు. పట్టణంలోని పశువైద్యశాలలో గురువారం పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1నుంచి పెయ్య దూడల ఉత్పత్తి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆడ దూడల వల్ల పాడిరైతులకు లాభాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ మట్టి తరలిస్తున్న వారిపై కేసు

నంగునూరు(సిద్దిపేట): అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసీఫ్ తెలిపారు. గురువారం ముంధ్రాయి శివారులో కొందరు వ్యాపారులు మట్టిని తవ్వి అక్రమంగా అమ్ముకున్నట్లు సమాచారం అందగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి నాలుగు టిప్పర్లు, జేసీబీ, హిటాచీలను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

◆ వైభవంగా ఆర్ద్రా మహోత్సవం

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో గురువారం ఆర్ద్రామహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. నిర్వాహకుడు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతాన పాశుపత హోమం, నవగ్రహ నక్షత్ర హవనం పూర్ణాహుతి కనుల పండువగా జరిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గట్టు విఠల్, మర్యాల రవీందర్, ఊడెం తిరుపతిరెడ్డి, చీకోటి రాజేంద్రప్రసాద్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ వీధికుక్కల నియంత్రణకు చర్యలు

గజ్వేల్‌రూరల్: వీధికుక్కల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పేర్కొన్నారు. యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సహకారంతో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో వీధి కుక్కలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు పాలకవర్గం తీర్మానించిందన్నారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

◆ ఘనంగా క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు

బెజ్జంకి(సిద్దిపేట): జాతీయ క్రీడా, తెలుగుభాషా దినోత్సవాలను గురువారం బెజ్జంకి బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన లయన్స్ క్లబ్ సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. పీడీ మాలతి, తెలుగు ఉపాధ్యాయురాలు మాధవీలతను సన్మానించారు. హెచ్ఎం శ్రీరాములు, శంకరాచారి, నాగయ్య, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

◆ క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

గజ్వేల్‌రూరల్: క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని, అందులో చేరిన విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాలలో ప్రత్యేక స్థానం ఉంటుందని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి పేర్కొన్నారు. గత ఫిబ్రవరిలో ఏ1 సర్టిఫికెట్ కోసం ఎన్‌సీసీ విద్యార్థులు పరీక్షలు రాయగా ఉత్తీర్ణులైన వారికి గురువారం సికింద్రాబాద్ 2టీ బెటాలియన్ అధికారి ప్రదీప్‌సింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ థామస్ రెడ్డి, ప్రిన్సిపాల్ విజయపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ వరం లాంటిది

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఓ వరం లాంటిదని మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో చెర్ల లావణ్యకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులుతో కలిసి ఆయన గురువారం అందజేశారు.